హ్యాట్రిక్ విజయం సాధిస్తాం


నాయకులతో కలిసి బైక్‌ర్యాలీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్, మే 11 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల గడ్డపై హ్యాట్రిక్ విజయం సాధిస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు మద్దతుగా హఫీజ్‌పేట, గచ్చిబౌలి, చందానగర్ డివిజన్‌లలో శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, నాయకులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బైక్ నడిపి కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ రెండుసార్లు అవకాశం ఇచ్చిన ఇద్దరు నేతలు ఇప్పుడు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ ప్రజావ్యతిరేక శక్తులను ఇంటికి పంపాలన్నారు.

● గచ్చిబౌలిలో బైక్‌ర్యాలీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి శనివారం మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాయదుర్గం, టెలికామ్‌నగర్, గచ్చిబౌలి, జీపీఆర్ఏ క్వార్టర్స్, గుల్‌మొహర్ పార్కు, నల్లగండ్ల, గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్, గౌలిదొడ్డి మీదుగా గచ్చిబౌలి డివిజన్లలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు.

● హైదర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ సాయిప్రశాంత్‌నగర్ ఫేజ్-2, ఇందిరానగర్‌లో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కారుగుర్తుపై ఓట్లు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.

● బైకు ర్యాలీలో ఎమ్మెల్యే గాంధీ

వివేకానందనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్‌కు సంబంధించి ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సప్తగిరికాలనీలోని క్యాంపు కార్యాలయం వద్ద కార్పొరేటర్ మాధవరం రోజా దేవి ఆధ్వర్యంలో బైకు ర్యాలీని ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఎన్నికల్లో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని, తెలంగాణ ప్రజలంతా బీఆర్ఎస్ వైపు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు పాల్గొన్నారు.


సాయిప్రశాంత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రంజిత్‌రెడ్డి విజయం తథ్యం

చందానగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు మిరియాల రాఘవరావు తెలిపారు. రంజిత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని రాఘవరావు ఆధ్వర్యంలో చందానగర్‌లో శనివారం ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. చందానగర్ శ్రీనివాస అపార్టుమెంట్‌లో స్థానికులతో ఆత్మీయ సమావేశంలో రాఘవరావుతో పాటు ఎంబీసీ చైర్మన్ జైపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, రఘుపతిరెడ్డి, సునీతారెడ్డి, ఉరిటి వెంకట్రావ్, హరీష్, ప్రీతమ్, శేఖర్‌రెడ్డి, సుబ్బారావు, త్రినాథ్, యాదయ్య స్థానికులు పాల్గొన్నారు.

● రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పార్టీ నాయకులతో కలిసి రంజిత్‌రెడ్డికి మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న మిరియాల రాఘవరావు, ఎంబీసీ చైర్మన్ జైపాల్

● కాంగ్రెస్‌లో చేరికలు

ఎల్‌బీనగర్: చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి విజయం తథ్యమని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి భాస్కర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పాల్గొన్నారు.

● గుర్రంగూడలో చిగిరింత ప్రచారం

సరూర్‌నగర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీతోనే అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుందని, ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటేస్తే వృథాయేనని బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం గుర్రంగూడలోని గడ్డం ఎన్‌క్లేవ్‌లో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ఐలమ్మ, వెంకట్‌గౌడ్, లక్ష్మీనరసమ్మ, విఘ్నేశ్‌రెడ్డి, శివగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రంజిత్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

మారుతి సుజుకి కొత్త స్విఫ్ట్ కార్ లాంచ్

జడ్ సిరీస్ ఇంజన్‌తో అందుబాటులోకి..

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): మారుతి సుజుకి తన కొత్త స్విఫ్ట్ కారు 'ది ఎపిక్ న్యూ స్విఫ్ట్'ను మార్కెట్‌లో శనివారం అందుబాటులోకి తెచ్చింది. వరుణ్ మోటర్స్ కొంపల్లిలో కొత్త కారును నటి హెబ్బాపటేల్, రీజనల్ మేనేజర్ బిక్రం సత్యపతి, జీఎం కె.కృష్ణకుమార్, ఏజీఎం శ్రీకాంత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతి సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పాత స్విఫ్ట్‌తో పోల్చితే 14 శాతం మెరుగుపరిచామని, ప్రస్తుతం కొత్త కారులో జడ్ సిరీస్ ఇంజన్‌తో 4 జనరేషన్ హాచ్‌బ్యాక్ స్విఫ్ట్ కారుతో ఇంధనం పొదుపు అవుతుందన్నారు. కొత్త స్విఫ్ట్‌లో 6 ఎయిర్‌బ్యాగులు, ఈఎస్‌పీ, ఏబీఎస్, ఈబీడీ, హిల్‌హోల్డ్ అసిస్ట్ ఫీచర్లున్నాయని తెలిపారు.



కొత్త స్విఫ్ట్ కారును ప్రారంభిస్తున్న నటి హెబ్బాపటేల్ తదితరులు

అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రి నగర్ కూడలి వద్ద శనివారం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు రూ.37,400 విలువ చేసే మద్యాన్ని పట్టుకున్నారు



బీఆర్ఎస్ పాలన అభివృద్ధికి నిదర్శనం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం, మే 11 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలన సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనమయితే, పదేళ్ల బీజేపీ, నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన అబద్ధపు హామీలు, మోసపూరిత వాగ్దానాలకు నిదర్శనమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శనివారం చివరి రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు నిజాంపేట్ కార్పొరేషన్, కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటువేస్తే తెలంగాణ ప్రజల భవిష్యత్ ప్రశ్నార్థకమేనన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. ప్రచారంలో కార్పొరేటర్లు జగన్, విజయ్‌శేఖర్ గౌడ్, రశీదాబేగం, మంత్రి సత్యనారాయణ ఉన్నారు.

● లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సూరారం డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఓటర్లను కోరారు. శ్రీరాంనగర్‌లో శనివారం ప్రచారం చేశారు.

● బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే శివారు ప్రాంతాల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం సూరారం డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లో పర్యటించారు.

● **ఓల్డుబోయినపల్లి:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రజలకు సూచించారు. శనివారం ఓల్డుబోయినపల్లిలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్ ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు.

● **కూకట్‌పల్లి:** లక్ష్మారెడ్డి గెలుపుతోనే మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం కూకట్‌పల్లి, ప్రశాంతినగర్, వెంకటేశ్వరనగర్, అస్‌బెస్టాస్‌కాలనీ ప్రాంతాల్లో బైకు ర్యాలీ నిర్వహించారు.

● రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఫతేనగర్ డివిజన్‌లో నాయకులతో కలిసి బైకు ర్యాలీ నిర్వహించారు.


ప్రగతీనగర్ ప్రచారంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


ఫతేనగర్‌లో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఈటల గెలుపు ఖాయం


మూసాపేటలో బైకు ర్యాలీలో బీజేపీ కార్పొరేటర్ మహేందర్, నాయకులు

కూకట్‌పల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపొంది మరోసారి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. మూసాపేట డివిజన్‌లోని మూసాపేట, జనతానగర్, మోతీనగర్, బబ్బుగూడ ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బైకు ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ కూటమికి 400 ఎంపీ సీట్లు రాబోతున్నాయని, మరోసారి మోదీ ప్రధాని కాబోతున్నారన్నారు. మల్కాజిగిరిలో అనుభవజ్ఞుడైన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే నియోజకవర్గ పరిధిలోని సమస్యలకు పరిష్కారం లభించేలా కృషి చేస్తారని, ఓటర్లు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో డాకయ్య, మల్లేష్‌గౌడ్, యాదన్న, ఎర్రస్వామి, భాస్కర్, నాగరాజు, వినోద్‌కుమార్, కిషోర్, అభిలాష్ పాల్గొన్నారు.


ప్రచారం ముగిసే సమయానికి కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలో ప్రచారం చేస్తున్న ఈటల రాజేందర్

● మల్కాజిగిరిలో..

కుత్బుల్లాపూర్ జోన్‌బృందం: మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం కోసం నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్‌లో 150 మంది కార్యకర్తలతో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించి, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ ర్యాలీలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, పార్లమెంట్ కో-కన్వీనర్ డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, 18వ డివిజన్ బీజేపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శివారెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జీడిమెట్ల డివిజన్‌లో కుత్బుల్లాపూర్ గ్రామం హరిజనబస్తీ, పాటిగడ్డ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఈటల రాజేందర్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు నిర్వహించారు. అలాగే రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్, గాంధీనగర్, గురుమూర్తినగర్, గిరినగర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం చేస్తూ ఈటలకు ఓటు వేయాలని కోరారు.

● బీజేపీ వైపే టీడీపీ ఓటర్లు

జీడిమెట్ల: ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే కూటమి పొత్తు ధర్మంలో భాగంగా తెలంగాణాలోని మల్కాజిగిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఓటర్లందరూ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటువేసి గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. సుభాష్‌నగర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టీడీపీ మున్సిపల్ ఇన్‌చార్జి దోనే రామ్మోహన్‌రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకవల్లి వీరబాబు, డివిజన్ అధ్యక్షుడు నరసింగరావు, సుభాష్‌నగర్ డివిజన్ నాయకులు రమేష్, కూకట్‌పల్లి ఇన్‌చార్జి పద్మాచౌదరి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జె.సురేందర్ రెడ్డి, గంగాధరగౌడ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

● రాజేందర్‌ను గెలిపించండి: జమున

వనస్థలిపురం: అవినీతి రహిత పాలన కోసం మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలనీ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరిరోజు శనివారం మన్సూరాబాద్ డివిజన్‌లో కార్పొరేటర్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీకి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ నిర్ణయించే ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొని కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు